# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-11-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. దేశ సరిహద్దుల్లో ఒక్క అంగుళం భూమి విషయంలోనూ భారత్ రాజీపడబోదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.**

**2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీకాకుళం జిల్లాలో ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.**

**3. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

**4. రాష్ట్రంలో మద్యం ధరల స్థిరీకరణకు త్వరలోనే కమిటీ వేస్తామని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

**5. ప్రముఖ తెలుగు కవి, రచయిత.. దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి ఈరోజు.**

==========================

దేశ సరిహద్దుల్లో ఒక్క అంగుళం భూమి విషయంలోనూ భారత్ రాజీపడబోదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నిన్న దీపావళి పండుగను సరిహద్దు భద్రతా దళాలతో జరుపుకున్నారు. గుజరాత్‌లోని క్రీక్‌లోని లక్కీ నాలా వద్ద సైనికులకు మిఠాయిలు పంచి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, ప్రతికూల పరిస్థితుల్లోనూ సైనికులు తమను తాము నిరూపించుకున్నారని అన్నారు. సవాళ్ళతో కూడిన సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల నిబద్ధత, అంకితభావం అసామాన్యమైనవని ప్రశంసించారు. పర్వత ప్రాంతాల్లోను, అత్యల్ప, అత్యధిక ఉష్ణోగ్రతల్లోను సైనికులు తమ సేవలను అందిస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలం ఇదుపురం గ్రామంలో దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి, మొదటి సిలిండర్ ని లబ్ధిదారులకు అందజేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖపట్నానికి చేరుకోనున్న ఆయన.. విశాఖ నుంచి హెలికాప్టర్లో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు

వెళ్తారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

మరోవైపు.. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జగన్నాథపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకోనున్నారని అధికారులు వెల్లడించారు.

----------------------------

తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో ఆయన నిన్న మాట్లాడుతూ, టన్ను ఆయిల్ పామ్‌కు 19 వేలకు పైగా ధర పలుకుతోందని చెప్పారు. దీని సాగుతో రైతుల ఆర్థిక పరిస్థితి మారుతుందని పేర్కొన్నారు. ఈ పంట సాగులో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు రావాలని మంత్రి తెలిపారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం ధరల స్థిరీకరణకు త్వరలోనే కమిటీ వేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిన్న ఆయన మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాలు కేటాయించామని. మద్యం ఉత్పత్తి సంస్థలతో టెండర్ కమిటీ సంప్రదింపులు జరిపి ధరలను నిర్ణయిస్తుందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 30సెకన్లు

----------------------------

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈ ఏడాదికి గానూ 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' పురస్కారాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిన్న ప్రకటించింది. ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనపరిచిన పోలీసు సిబ్బందికి ఈ పురస్కారాలను అందజేయనుంది. దేశవ్యాప్తంగా 463 మంది పోలీసు సిబ్బందికి ఈ అవార్డులను ప్రకటించగా, ఇందులో ఉభయ రాష్ట్రాలకు చెందిన పోలీస్ అధికారులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు ఎస్పీలు, తెలంగాణ నుంచి ఒక ఎస్పీతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పోలీసు కానిస్టేబుళ్లు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

----------------------------

ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రజలు సురక్షితంగా గమ్యం చేరేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో ట్రాఫిక్ నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌ను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ( 32 సెకన్లు )

----------------------------

ప్రముఖ తెలుగు కవి, రచయిత, అనువాదకులు.. దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి ఈరోజు, తెలుగు భావ కవితా రంగంలో... కృష్ణశాస్త్రి ఒక ముఖ్య అధ్యాయం, తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురంలోని రావువారి చంద్రపాలెం గ్రామంలో 1897 నవంబరు 1వ తేదీన జన్మించారు. 1918లో విజయనగరంలో డిగ్రీ

పూర్తి చేసి... పెద్దాపురం మిషన్ హైస్కూలులో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. అంతేకాక ఆయన బ్రహ్మసమాజంలో చురుగ్గా పాల్గొనేవారు. 1945లో ఆకాశవాణిలో చేరి అనేక పాటలు, నాటికలు రచించారు. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... మల్లీశ్వరి చిత్రంతో సినీరంగంలో అడుగుపెట్టారు. 1980 ఫిబ్రవరి 24న ఆయన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని 100 పడకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు 82కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.

---------------------------

దీపావళి, ఛత్ పూజ వంటి పండుగల సందర్భంగా ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే 850 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ప్రయాణికుల సౌకర్యంతో పాటు భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన రైల్వే స్టేషన్‌లలో రద్దీని, రైళ్ళ రాకపోకల సమయాన్ని సమీక్షించడానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఆహార పదార్థాలను అందించేందుకు పలు స్టేషన్లలో క్యాటరింగ్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా అదనపు ఆర్‌పిఎఫ్ పోలీసు బలగాలను మొహరించామని, సీసీటీవీ పర్యవేక్షణను పెంచామని అధికారులు తెలియజేశారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న దక్షిణా ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 3.1 కిలోమీటర్ల మధ్య విస్తరించి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈరోజు, రేపు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

తెలంగాణలో రెండ్రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

---------------------------

యువత సమగ్రాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వారి అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా ఒక రాష్ట్రానికి చెందిన యువతను మరో రాష్ట్రంలో పర్యటించేలా యువత సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గుంటూరు జిల్లాలో జరిగిన "వతన్ కో జానో" కార్యక్రమం గురించి ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యకమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

====================